'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 35 | శనివారం | 19.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 35 | Saturday | 19.9.2026 | Pages: 8 | Rate: 2


5లో..



## అహో.. ఆంధ్రభోజా...!

### రాయలవారి వంశం.. రగులుతున్న వివాదం!

- శాసనాలేం ఉటంకిస్తున్నాయ్? వాదనలేం చెబుతున్నాయ్?
- కులం కోసం చరిత్రను లాగితే... నిజం ఎక్కడ నిలబడుతుంది?
- నంద్యాలలో రాయలోరి విగ్రహావిష్కరణతో రచ్చ

శ్రీ కృష్ణదేవరాయలు ఎవరు? ఆయన ఏ వంశానికి చెందినవారు? ఈ ప్రశ్న ఇప్పుడు మరోసారి రాయలసీమ గుండెల్లో రచ్చ రేపుతోంది. నంద్యాలలో రాయల విగ్రహావిష్కరణతో మొదలైన వివాదం.. కుల హక్కుల వాదనల వరకు వెళ్లింది. బలిజ సంఘాలు రాయలు తమ వంశపురుషుడని చెబుతుంటే... యాదవ సంఘాలు తమ వాదనకు పురావస్తు ఆధారాలు ఉన్నాయని అంటున్నాయి. శిలాఫలకంపై ఏ పేరు ఉండాలి అన్న ప్రశ్న... చివరకు చరిత్రను ఎవరు నిర్వచించాలి అన్న పెద్ద ప్రశ్నగా మారింది. అయితే పదహారో శతాబ్దపు విజయనగర చక్రవర్తికి ఇరవై ఒకటో శతాబ్దపు కుల గుర్తింపులను నేరుగా వర్తింపజేయగలమా? తుళువ వంశం ఏం చెబుతోంది? తిరుమల శాసనాలు ఏం వెల్లడిస్తున్నాయి? చంద్రవంశ ప్రస్తావనకు యాదవ వాదనకు సంబంధం ఎంత? 'నాయక' అనే బిరుదు ఏం సూచిస్తోంది? ప్రొద్దుటూరులో వెలుగుచూసిన శాసనం ఏం చెబుతోంది? ఒకవైపు వంశాభిమానాలు.. మరోవైపు రాతిలో చెక్కిన చరిత్ర. ఈ రెండింటి మధ్య అసలు నిజం ఎక్కడ నిలబడుతుంది? ఆధారాలు, శాసనాలు, వంశావళులు, సమకాలీన సాహిత్యాన్ని పరిశీలిస్తే తెరపైకి వస్తున్న సమాధానాలు ఏమిటి? రాయల వారసత్వం కోసం జరుగుతున్న ఈ పోరులో.. చరిత్ర గెలుస్తుందా? కుల వాదన గెలుస్తుందా?




## డ్యామిట్..కథ అడ్డం తిరిగింది!

### దానంపై వేటు.. ఉపఎన్నికలో గెలుపు డౌటు!

- జోరుమీద కమలం, కారు... హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్ బేజారు
- జూబ్లీహిల్స్ రిజల్ట్స్ రావడం కష్టం.. తేడా వస్తే అధికార పార్టీకి తీరని నష్టం



ఖైరతాబాద్ రాజకీయాల్లో ఒక్కసారిగా భారీ ట్విస్ట్.. ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. 2023లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన దానం.. 2024లో కాంగ్రెస్‌లో చేరడం, అదే పార్టీ తరఫున సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం ఇప్పుడు ఆయన ఎమ్మెల్యే పదవికే ఎసరు పెట్టింది. రాజీనామా చేయకపోయినా పార్టీ మారిన తీరు, ఎన్నికల్లో మరో పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన చర్యలను కోర్టు కీలకంగా పరిగణించింది. మహాచంద్ర ప్రసాద్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు చెప్పిన న్యాయసూత్రం కూడా ఈ వ్యవహారంలో ప్రధాన అంశంగా మారింది. స్పీకర్ నిర్ణయాన్ని పక్కన పెట్టిన హైకోర్టు.. ఖైరతాబాద్ సీటు ఖాళీగా ప్రకటించింది. ఇక్కడే కథ ఊహించని మలుపు తిరిగింది. సాధారణంగా సుప్రీంకోర్టు మెట్లెక్కుతారని భావించిన దానం మాత్రం "సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదు.. ప్రజాక్షేత్రంలోనే కొట్లాడతా" అంటూ ప్రకటించారు. మరి ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక వస్తే దానం మళ్లీ బరిలోకి దిగడం ఖాయమనుకోవాల్సి ఉంటుంది? కాంగ్రెస్ ఏ వ్యూహం అనుసరిస్తుంది? బీఆర్ఎస్, బీజేపీల లెక్కలేంటి? హైకోర్టు తీర్పుతో మొదలైన ఈ ప్రకంపనలు తెలంగాణ రాజకీయాల్లో ఎక్కడికి దారితీయనున్నాయి? అసలు ట్విస్ట్ ఇక్కడే ఉంది..

## ఖైరతాబాద్ సీటు ఖాళీ

### పార్టీ ఫిరాయింపుపై హైకోర్టు తీర్పు

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను తెలంగాణ హైకోర్టు అనర్హుడిగా ప్రకటించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. అంతేకాదు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ చర్యను పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లుగా పరిగణించిన హైకోర్టు, రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ కింద అనర్హత వర్తిస్తుందని స్పష్టం చేసింది. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌ల డివిజన్ బెంచ్ ఈ తీర్పు ఇచ్చింది.

## మళ్లీ పోటీ చేస్తా.. గెలిచొస్తా

### తీర్పు తర్వాత దానం ధీమా

హైకోర్టు తీర్పుతో ఎమ్మెల్యే పదవి కోల్పోయిన కొద్ది గంటల్లోనే దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఖైరతాబాద్‌కు ఉపఎన్నిక షెడ్యూల్ విడుదలైతే తాను మళ్లీ పోటీ చేస్తానని స్పష్టం చేశారు. తీర్పును స్వాగతిస్తున్నానని, ప్రస్తుతం సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేయడం తనకు కొత్త కాదని, ఎన్నికలు వస్తే తప్పకుండా బరిలోకి దిగుతానని నాగేందర్ తెలిపారు. ఈసారి కూడా విజయం సాధిస్తానన్న ధీమా వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పు తనకు వ్యతిరేకంగా వచ్చినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్న సంకేతాలను ఆయన వ్యాఖ్యలు ఇచ్చాయి.

## బీసీ జనాభాపై కుట్ర

### కుల వివక్ష అంతం కావాలి: కవిత




బీసీ కులాల జనాభాను తక్కువగా చూపించే కుట్ర జరుగుతోందని కల్వకుంట్ల కవిత ఆరోపించారు. దేశంలో ఎంతటి ఉన్నతస్థాయిలో ఉన్న వ్యక్తులైనా కుల వివక్షకు అతీతులు కారని ఆమె అన్నారు. రాష్ట్రపతి, స్పీకర్ వంటి అత్యున్నత పదవుల్లో ఉన్నవారు కూడా కుల వివక్షను ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. లక్షలాది మంది ఇప్పటికీ రోజువారీ జీవితంలో వివక్షను ఎదుర్కొంటున్నారని చెప్పారు.




## ఆర్టీసీ యూనియన్ ఎన్నికలు

### అక్టోబర్ 9న పోలింగ్

ఎనిమిదేళ్ల విరామం తర్వాత తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో యూనియన్ ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 9న ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. ఎన్నికల ప్రక్రియలో తొలి దశగా పోటీ చేయాలనుకునే యూనియన్లు సెప్టెంబర్ 21న తమ సమ్మతిని తెలియజేయాల్సి ఉంటుంది.

## రాజకీయ కక్షల యాత్రలా?

### కాంగ్రెస్ ఎంపీలపై హరీశ్‌రావు ఫైర్

సిద్దిపేటలో ఎంపీల యాత్ర పేరుతో అధికార కాంగ్రెస్ ప్రజాధనం, ప్రభుత్వ సమయాన్ని వృథా చేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఏదో యుద్ధానికి వచ్చినట్లుగా యాత్ర నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. (వివరాలు 2లో..)






## ఫార్ములా ఈ కేసుపై కేటీఆర్ ధీమా

### హైదరాబాద్ ఇమేజ్ కోసమే రేసు

ఫార్ములా ఈ రేసును హైదరాబాద్‌కు తీసుకురావడం ద్వారా తెలంగాణకు, హైదరాబాద్ మహానగరానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంతో పాటు పెట్టుబడులను ఆకర్షించాలనుకున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ( 2లో..)



## అగార్కర్ నిష్క్రమణకు దారి!

రికార్డులు వచ్చాయి.. కానీ ఎంపికలపై ప్రశ్నలే! టీమిండియా చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం ముగింపు దశకు చేరుకోవడంతో ఆయన నిర్ణయాలపై మరోసారి చర్చ మొదలైంది. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఎంపికలో మహ్మద్ సిరాజ్‌కు చోటు ఇవ్వకపోవడం, యశస్వి జైస్వాల్‌ను తప్పించి వరుణ్ చక్రవర్తిని ఎంపిక చేయడం వంటి నిర్ణయాలపై అప్పట్లోనే తీవ్ర చర్చ జరిగింది. (వివరాలు 3లో..)




## దానం ఫైటర్ కాదు.. చీటర్

### కౌశిక్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటును బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి స్వాగతించారు. దానం నాగేందర్‌కు పట్టిన గతే పార్టీ ఫిరాయించిన మిగతా ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు కూడా ఎదురవుతుందని ఆయన అన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, దానం ఫైటర్ కాదు.. చీటర్ అంటూ విమర్శించారు. (2లో..)


2లో..

## దానం అనర్హతను స్వాగతించిన బీజేపీ

### ఫిరాయింపులపై కాంగ్రెస్‌కు ప్రశ్నలు

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేయడాన్ని బీజేపీ స్వాగతించింది. బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌కు అనుకూలంగా, స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెటి హైకోర్టు ఇచ్చిన తీర్పు నైతికంగా, చట్టపరంగా, రాజ[illegible]గా సాధించిన విజయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు పేర్కొన్నారు.

2లో..

## దానం అనర్హతపై కేటీఆర్, హరీశ్ హర్షం

### మిగతా ఫిరాయింపుదారులకు అదే తీర్పు

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. "సత్యమేవ జయతే" అంటూ సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్‌ను హైకోర్టు అనర్హుడిగా ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ తీర్పును పార్టీ ఫిరాయింపుల అంశంలో కీలక పరిణామంగా కేటీఆర్ అభివర్ణించారు. (వివరాలు 2లో..)



## ఎల్‌నినో దెబ్బ

- 20 శాతం వర్షపాతం లోటు • తెలంగాణకు కరువు ముప్పు
- వర్షాభావంపై కేంద్రానికి భట్టి విజ్ఞప్తి



2026 నైరుతి రుతుపవనాల సమయంలో ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 16 వరకు సాధారణంగా 664.5 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 536.5 మి.మీ. మాత్రమే నమోదైంది. దీంతో 20 శాతం లోటు ఏర్పడింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 19 జిల్లాలు వర్షాభావ ప్రాంతాలుగా ఉన్నాయని వివరించారు. (2లో..)

## తుమ్మిడిహెట్టికి నిధుల కొరత లేదు

### మిల్లర్ల సమస్యలు పరిష్కరిస్తామన్న ఉత్తమ్



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంశంపై బీజేపీ నేతలు మాట్లాడటం మానుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును స్పష్టమైన ప్రణాళికతో ముందుకు తీసుకెళ్తున్నామని, నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. ప్రస్తుత బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.25 వేల కోట్లు కేటాయించామని తెలిపారు. (వివరాలు 2లో..)



## జన్వాడ ఫార్మ్‌హౌస్‌పై యజమాని క్లారిటీ

### భూమి నాదే.. కేటీఆర్‌కు సంబంధం లేదు

జన్వాడ ఫార్మ్‌హౌస్ భూములపై జరుగుతున్న ప్రచారానికి యజమాని ప్రదీప్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. ఫార్మ్‌హౌస్ ఉన్న భూమి తన సొంతమని, కేటీఆర్‌కు ఆ భూమిపై ఎలాంటి యాజమాన్య సంబంధం లేదని తెలిపారు. కేటీఆర్ తనకు చిన్నప్పటి నుంచి స్నేహితుడని, తన సొంత ప్రాపర్టీని ఆయనకు లీజుకు ఇచ్చినట్లు వివరించారు. ప్రస్తుతం రాజకీయ పార్టీల నేతలు ఫార్మ్‌హౌస్‌ను పరిశీలించేందుకు వస్తారన్న ప్రచారం జరుగుతోందని, దీనిపై రాజకీయ రాద్ధాంతం చేయడం సరికాదని ప్రదీప్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వానికి ఏమైనా అనుమానాలు ఉంటే నేరుగా నోటీసులు జారీ చేసి వివరణ కోరవచ్చని స్పష్టం చేశారు. (2లో..)

## గోదావరి పుష్కరాల పనులు వేగం పెంచాలి

### ఏప్రిల్ నాటికి పనులు పూర్తి చేయాల్సిందే

### పాత సవాళ్లు మళ్లీ రావొద్దన్న శ్రీధర్ బాబు

కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు 2027ను ఘనంగా నిర్వహించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. శుక్రవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో పుష్కరాల ఏర్పాట్లపై సమీక్షించారు. గత పుష్కరాల్లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఏప్రిల్ నాటికి పనులన్నీ పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఘాట్ల నిర్మాణం, దేవాలయాల అభివృద్ధి, రవాణా, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. (వివరాలు 2లో..)



# బీసీ జనాభాపై కుట్ర

## కుల వివక్ష అంతం కావాలి: కవిత



బీసీ కులాల జనాభాను తక్కువగా చూపించే కుట్ర జరుగుతోందని కల్వకుంట్ల కవిత ఆరోపించారు. దేశంలో ఎంతటి ఉన్నతస్థాయిలో ఉన్న వ్యక్తులైనా కుల వివక్షకు అతీతులు కారని ఆమె అన్నారు. రాష్ట్రపతి, స్పీకర్ వంటి అత్యున్నత పదవుల్లో ఉన్నవారు కూడా కుల వివక్షను ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. లక్షలాది మంది ఇప్పటికీ రోజువారీ జీవితంలో వివక్షను ఎదుర్కొంటున్నారని చెప్పారు. లంబాడాలకు ఇళ్లు ఇవ్వవద్దంటూ బోర్డు పెట్టిన ఘటనను ప్రస్తావిస్తూ, కులం ఆధారంగా ఇళ్లు నిరాకరించడం దారుణమన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం రావాలంటే ముందుగా సమాజ ఆలోచనా విధానంలో మార్పు రావాలని కవిత సూచించారు.

**అన్ని వర్గాలకు సాధికారత**

కుల వివక్షను బాధితుల కోణంలోనూ చూడాల్సిన అవసరం ఉందని కవిత అన్నారు. కులం సంక్లిష్టమైన సామాజిక సమస్యగా పేర్కొంటూ, రాజ్యాధికారంలో అన్ని కులాలకు భాగస్వామ్యం కల్పించడంతో పాటు ఆర్థికంగా బలోపేతం చేయాలని సూచించారు. కలిసి కూర్చున్నా, తాకినా ఏదో జరుగుతుందనే మూఢ భావనలు ఇంకా కొనసాగుతున్నాయని అన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉదాహరణగా చూపుతూ, రాజకీయ, సాంస్కృతిక ఐక్యతతోనే రాష్ట్ర సాధన సాధ్యమైందని గుర్తుచేశారు. బతుకమ్మ, బోనాల ద్వారా మహిళలు ఉద్యమానికి మద్దతిచ్చారని తెలిపారు. అదే సమిష్టి స్ఫూర్తితో కుల వివక్షకు పరిష్కారం వెతికి, ప్రతి కులాన్ని సాధికారత కల్పించినప్పుడే సమానత్వం సాధ్యమవుతుందని కవిత పేర్కొన్నారు.

# జన్వాడ ఫార్మ్‌హౌస్‌పై యజమాని క్లారిటీ

## భూమి నాదే.. కేటీఆర్‌కు సంబంధం లేదు



జన్వాడ ఫార్మ్‌హౌస్ భూములపై జరుగుతున్న ప్రచారానికి యజమాని ప్రదీప్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. ఫార్మ్‌హౌస్ ఉన్న భూమి తన సొంతమని, కేటీఆర్‌కు ఆ భూమిపై ఎలాంటి యాజమాన్య సంబంధం లేదని తెలిపారు. కేటీఆర్ తనకు చిన్నప్పటి నుంచి స్నేహితుడని, తన సొంత ప్రాపర్టీని ఆయనకు లీజుకు ఇచ్చినట్లు వివరించారు. ప్రస్తుతం రాజకీయ పార్టీల నేతలు ఫార్మ్‌హౌస్‌ను పరిశీలించేందుకు వస్తారన్న ప్రచారం జరుగుతోందని, దీనిపై రాజకీయ రాద్ధాంతం చేయడం సరికాదని ప్రదీప్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వానికి ఏమైనా అనుమానాలు ఉంటే నేరుగా నోటీసులు జారీ చేసి వివరణ కోరవచ్చని స్పష్టం చేశారు.

**టైటిల్ క్లియర్.. పత్రాలు ఇస్తా**

జన్వాడ ఫార్మ్‌హౌస్ భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలు లేవని ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. భూములకు చట్టపరంగా క్లియర్ టైటిల్ ఉందని వెల్లడించారు. ప్రభుత్వ అధికారులు అవసరమైన వివరాలు, పత్రాలు కోరితే చట్టబద్ధమైన విధానంలో సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. వ్యక్తిగత ఆస్తిని రాజకీయ నేతలు పరిశీలిస్తామంటూ వివాదం సృష్టించడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. ఫార్మ్‌హౌస్ భూమి తనదేనని మరోసారి స్పష్టం చేస్తూ, కేటీఆర్ తన స్నేహితుడు మాత్రమేనని, ప్రాపర్టీని ఆయనకు లీజుకు ఇచ్చానని తెలిపారు. అధికారుల నుంచి ఎలాంటి నోటీసులు వచ్చినా పూర్తిగా సహకరిస్తానని ప్రదీప్‌రెడ్డి వెల్లడించారు.

# రాజకీయ కక్షల యాత్రలా?

## కాంగ్రెస్ ఎంపీలపై హరీశ్‌రావు ఫైర్



సిద్దిపేటలో ఎంపీల యాత్ర పేరుతో అధికార కాంగ్రెస్ ప్రజాధనం, ప్రభుత్వ సమయాన్ని వృథా చేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఏదో యుద్ధానికి వచ్చినట్లుగా యాత్ర నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వాలు వాస్తవాలను దాచిపెట్టినప్పుడు ప్రతిపక్షాలు నిజనిర్ధారణ కోసం క్షేత్రస్థాయికి వెళ్తాయని, కానీ అధికారంలో ఉన్న ప్రభుత్వమే యాత్రల పేరుతో రావడం శోచనీయమన్నారు. ప్రభుత్వానికి అధికారం ఉన్నందున వాస్తవాలను తెలుసుకునేందుకు నివేదికలు తెప్పించుకోవచ్చని సూచించారు. ఎంపీలంతా రాష్ట్ర హక్కుల కోసం కలిసికట్టుగా కేంద్రంపై పోరాడాలి తప్ప రాజకీయ కక్షసాధింపులకు యాత్రలను ఉపయోగించకూడదని హరీశ్‌రావు అన్నారు.

**దళితుల భూములపై నేరుగా సవాల్**

దళితుల భూముల అంశాన్ని ప్రస్తావిస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు నేరుగా ప్రశ్న సంధించారు. కేసీఆర్ వద్ద దళితుల భూములు లేవని తేలితే కాంగ్రెస్ నేతలు రాజీనామా చేస్తారా? ఒకవేళ భూములు ఉన్నట్లు నిరూపితమైతే తాము రాజీనామా చేయడానికి సిద్ధమని సవాల్ చేశారు. ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం బురద రాజకీయాలకు తెరలేపుతోందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ఎన్ని డైవర్షన్ రాజకీయాలు చేసినా తాము వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తూనే ఉంటామని, వాటిపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని హరీశ్‌రావు తెలిపారు.



# గోదావరి పుష్కరాల పనులు వేగం పెంచాలి

- ఏప్రిల్ నాటికి పనులు పూర్తి చేయాల్సిందే
- పాత సవాళ్లు మళ్లీ రావొద్దన్న శ్రీధర్ బాబు

కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు 2027ను ఘనంగా నిర్వహించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. శుక్రవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో పుష్కరాల ఏర్పాట్లపై సమీక్షించారు. గత పుష్కరాల్లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఏప్రిల్ నాటికి పనులన్నీ పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఘాట్ల నిర్మాణం, దేవాలయాల అభివృద్ధి, రవాణా, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

**ప్రతి పనికి గడువు.. నాణ్యతే ప్రాధాన్యం**

రద్దీ ఎక్కువగా ఉండే టైర్ 1 ప్రాంతాల్లో ఆధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. జిల్లాలవారీగా ప్రత్యేక అధికారులను నియమించామని, ప్రతి పనికి నిర్దిష్ట గడువు విధించాలని సూచించారు. పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ఇంటిగ్రేటెడ్ డ్యాష్‌బోర్డ్‌ను వెంటనే అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఇంజినీర్ల కొరత లేకుండా ఆర్అండ్‌బీ, ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై సిబ్బందిని తీసుకోవాలని చెప్పారు. పుష్కరాల సమయంలో వర్షాల అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ముందుగానే చేయాలని సూచించారు. భద్రాచలంలో ఎస్టీపీ నిర్మాణానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిధుల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని, పనుల నాణ్యతలో రాజీపడొద్దని మంత్రి స్పష్టం చేశారు.

# దానం నాగేందర్‌పై వేటు

## ఖైరతాబాద్ సీటు ఖాళీ

- పార్టీ ఫిరాయింపుపై హైకోర్టు తీర్పు

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను తెలంగాణ హైకోర్టు అనర్హుడిగా ప్రకటించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. అంతేకాదు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ చర్యను పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లుగా పరిగణించిన హైకోర్టు, రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ కింద అనర్హత వర్తిస్తుందని స్పష్టం చేసింది. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌ల డివిజన్ బెంచ్ ఈ తీర్పు ఇచ్చింది.

**ఏప్రిల్ 23 నుంచే అనర్హత**

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గతంలో దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్లను తిరస్కరించిన నిర్ణయాన్ని హైకోర్టు పక్కనపెట్టింది. 2024 ఏప్రిల్ 23 నుంచి నాగేందర్ ఎమ్మెల్యే సభ్యత్వం రద్దయినట్లు కోర్టు ప్రకటించింది. అదే రోజున ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారు. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు హైకోర్టు స్పష్టం చేసింది. తాజా తీర్పుతో ఆ నియోజకవర్గానికి ఉపఎన్నిక జరిగే పరిస్థితి ఏర్పడింది. తీర్పుపై అప్పీల్ చేసుకునే అవకాశం కోసం ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేయాలన్న నాగేందర్ తరఫు న్యాయవాది అభ్యర్థనను కూడా బెంచ్ తిరస్కరించింది. అసెంబ్లీ కార్యదర్శి, స్పీకర్ కార్యాలయం, ఎన్నికల సంఘానికి తీర్పు ప్రతిని పంపాలని ఆదేశించింది.








# దానం ఫైటర్ కాదు.. చీటర్

## కౌశిక్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్య విజయమని, ఇది సీఎం రేవంత్‌రెడ్డికి గట్టి ఎదురుదెబ్బ అని వ్యాఖ్యానించారు. రెండున్నరేళ్లుగా తాము సాగిస్తున్న పోరాటానికి ఈ తీర్పు ఫలితమని పేర్కొన్నారు. ప్రజలను ఎప్పటికీ మోసం చేయవచ్చని అనుకుంటే కుదరదని, హైకోర్టు బ్రేక్ వేసిందని కౌశిక్‌రెడ్డి అన్నారు. మిగతా ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై కూడా అనర్హత వేటు పడుతుందని చెప్పారు. ఖైరతాబాద్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీకి చెందినవారో చెప్పుకోలేని స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. కడియం శ్రీహరి, తన పార్టీ మార్పులపై ఎథిక్స్ కమిటీ నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

# దానం అనర్హతపై కేటీఆర్, హరీశ్ హర్షం

## మిగతా ఫిరాయింపుదారులపై అదే తీర్పు

మిగిలిన ఫిరాయింపుదారులకు కూడా త్వరలో ఇదే పరిస్థితి ఎదురవుతుందని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఫిరాయింపులపై న్యాయపరమైన చర్యలు కొనసాగుతున్న వేళ, ఇతర ఎమ్మెల్యేలపై కూడా ఇదే తరహా నిర్ణయాలు రావచ్చన్న అభిప్రాయాన్ని కేటీఆర్ తన ట్వీట్ ద్వారా వ్యక్తం చేశారు. మరోవైపు హైకోర్టు తీర్పు సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి చెంపపెట్టు వంటిదని వ్యాఖ్యానించారు మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు. అధికారంలో ఉన్న చోట నిబంధనలు పాటించకుండా, అధికారం లేని చోట నీతులు చెప్పడం సరికాదని రాహుల్‌గాంధీని ఉద్దేశించి విమర్శించారు. ప్రజాస్వామ్యం, పార్టీ ఫిరాయింపుల అంశంలో కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నించారు. దానం నాగేందర్‌పై వచ్చిన తీర్పు నేపథ్యంలో మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేలపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పీకర్ వెంటనే మిగతా ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకోవాలని హరీశ్‌రావు కోరారు.





# దానం కేసులో బీఆర్ఎస్ అప్రమత్తం

## సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు

దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో బీఆర్ఎస్ మరో కీలక అడుగు వేసింది. సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. దానం నాగేందర్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉన్న నేపథ్యంలో బీఆర్ఎస్ ముందస్తుగా ఈ చర్య చేపట్టింది. దానం నాగేందర్ తరఫున పిటిషన్ దాఖలైతే, తమ వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వవద్దని కేవియట్‌లో కోరినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం అనర్హతకు కారణమైంది. ఈ అంశంపై దాఖలైన పిటిషన్లను విచారించిన తెలంగాణ హైకోర్టు ఆయనపై అనర్హత వేటు వేసింది. తీర్పు అనంతరం తదుపరి న్యాయపరమైన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.



# దానం అనర్హతను స్వాగతించిన బీజేపీ

## ఫిరాయింపులపై కాంగ్రెస్‌కు ప్రశ్నలు

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని పదో షెడ్యూల్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఉల్లంఘిస్తోందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ఫిరాయింపులనే కాంగ్రెస్ కొనసాగిస్తోందని ఆరోపించారు. హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్ నైతికంగా, చట్టపరంగా ఓడిపోయిందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని గౌరవిస్తూ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలందరూ వెంటనే రాజీనామా చేసి, తిరిగి ప్రజాక్షేత్రంలో ఎన్నికలను ఎదుర్కోవాలని బీజేపీ డిమాండ్ చేస్తోందని రాంచందర్‌రావు తెలిపారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే మరో పార్టీలో చేరడం ప్రజాతీర్పుకు విరుద్ధమన్నారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించడం కీలక పరిణామమని అన్నారు.



# ఫార్ములా ఈ కేసుపై కేటీఆర్ ధీమా

## హైదరాబాద్ ఇమేజ్ కోసమే రేసు

ఫార్ములా ఈ రేసును హైదరాబాద్‌కు తీసుకురావడం ద్వారా తెలంగాణకు, హైదరాబాద్ మహానగరానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంతో పాటు పెట్టుబడులను ఆకర్షించాలనుకున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రేసులో ఏదో జరిగిందంటూ కార్యక్రమాన్ని రద్దు చేసి తనపై కేసు పెట్టారని ఆరోపించారు. ఫార్ములా ఈ కేసులో భాగంగా శుక్రవారం నాంపల్లి కోర్టుకు హాజరైన కేటీఆర్, తమిళనాడు సీఎం విజయ్ మోటార్ రేసింగ్ కార్యక్రమం కోసం లండన్‌కు వెళ్లిన విషయాన్ని ప్రస్తావించారు. మోటార్ స్పోర్ట్స్ ద్వారా రాష్ట్రానికి వచ్చే ఇమేజ్, ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో పెట్టుబడుల అవకాశాలను ఆయన వివరించారు. ఇదే ఉద్దేశంతో హైదరాబాద్‌కు రేసును తీసుకొచ్చామని, అందుకు తనను ఇబ్బంది పెడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా న్యాయస్థానాలపై తనకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. కేసు విచారణలో భాగంగా కోర్టు ఎప్పుడు పిలిచినా హాజరవుతానని స్పష్టం చేశారు.

# ఎల్‌నినో దెబ్బ

- 20 శాతం వర్షపాతం లోటు
- తెలంగాణకు కరువు ముప్పు

- వర్షాభావంపై కేంద్రానికి భట్టి విజ్ఞప్తి

. వర్షాల మధ్య ఎక్కువ విరామం రావడంతో పంటల సాగు విస్తీర్ణం తగ్గిందని, సాధారణంగా 139.29 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా 88 శాతం మేరకే పంటలు సాగయ్యాయని చెప్పారు. వరి సాగు దాదాపు 18 శాతం తగ్గిందన్నారు. పలుమార్లు విత్తనాలు వేయడంతో రైతులు, కౌలు రైతులపై పెట్టుబడి భారం పెరిగిందని పేర్కొన్నారు.

**తగ్గుతున్న నీటి నిల్వలు**

సెప్టెంబర్ 15 నాటికి ప్రధాన జలాశయాల్లో 585 టీఎంసీల సామర్థ్యానికి కేవలం 241 టీఎంసీల లైవ్ స్టోరేజ్ మాత్రమే ఉందని భట్టి తెలిపారు. గత ఏడాది ఇదే సమయంలో 497 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుత నిల్వలు యాసంగి పంటలకు సాగునీరు అందించేందుకు సరిపోవని, భూగర్భ జలాలు తగ్గడంతో తాగునీటి కొరత ముప్పు ఉందని వివరించారు. వర్షాభావ ప్రభావం రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ ఉపాధి, పశుసంపద, పశుగ్రాసంపై పడుతోందన్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక సిద్ధం చేసి తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరా కోసం ఉపశమన చర్యలు చేపడుతోందని తెలిపారు.

**కేంద్రం ముందు ఎనిమిది డిమాండ్లు**

వర్షాభావ పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు కేంద్రం తక్షణ సాయం అందించాలని తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా కోరాలని ముసాయిదా తీర్మానంలో ప్రతిపాదించారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ నిధులు విడుదల చేయడం, పంట నష్టం పరిహారం, పశుగ్రాసం, తాగునీరు, జలవనరుల పునరుద్ధరణకు సహాయం అందించాలని కోరారు. గ్రామీణ ఉపాధి కోసం అదనంగా 50 రోజుల పని కల్పించి, ఖర్చును కేంద్రం భరించాలని ప్రతిపాదించారు. ఎరువులు, ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు సకాలంలో ఇవ్వాలని, డ్రిప్ సాగుకు ప్రోత్సాహం పెంచాలని కోరారు. తెలంగాణకు 1,500 మెగావాట్ల అదనపు విద్యుత్, 5 మిలియన్ టన్నుల బొగ్గు లింకేజీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తాగు, సాగునీటి అవసరాలకు రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ, ఎఫ్ఆర్‌బీఎం రుణ పరిమితిని 3 నుంచి 3.5 శాతానికి పెంచాలని తీర్మానంలో కోరారు.






# ఆర్టీసీ యూనియన్ ఎన్నికలు

## క్టోబర్ 9న పోలింగ్

చివరిసారిగా 2016 జూలై 19న యూనియన్ల సభ్యత్వ ధ్రువీకరణ జరిగింది. నిబంధనల ప్రకారం తెలంగాణ మజ్దూర్ యూనియన్‌కు గుర్తింపు లభించింది. తాజా ఎన్నికల ప్రక్రియలో భాగంగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. పోటీ చేసే 46 కార్మిక సంఘాలకు తొలి నోటీసులు జారీ చేశారు. యూనియన్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, నిబంధనలు, అనుబంధ గుర్తింపు పత్రం, కోడ్ ఆఫ్ డిసిప్లిన్‌ను అంగీకరించిన హామీ, సభ్యత్వ రుసుము చెల్లించిన వారి జాబితా, ఆడిట్ చేసిన వార్షిక నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల అనంతరం అక్టోబర్ 17న ఫలితాలను ప్రకటించనున్నారు. దీంతో ఆర్టీసీ కార్మిక సంఘాల్లో ఎన్నికల సందడి మొదలుకానుంది.

# తుమ్మిడిహెట్టికి నిధుల కొరత లేదు

## మిల్లర్ల సమస్యలు పరిష్కరిస్తామన్న ఉత్తమ్

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను వేగవంతం చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ప్రాజెక్టు ముందుకు సాగేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంతో సమన్వయం అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం బీజేపీ నేతలు మహారాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో చర్చించి సహకరించాలని సూచించారు. నదీ జలాల వినియోగం, అంతర్రాష్ట్ర అంశాలు, ప్రాజెక్టు అనుమతులపై సంబంధిత ప్రభుత్వాలు, సంస్థలతో చర్చలు కొనసాగుతున్నాయని ఉత్తమ్ తెలిపారు.

**మిల్లర్ల సమస్యలపై నాలుగైదు రోజుల్లో మరో భేటీ**

రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్చల మార్గాన్ని ఎంచుకుంది. అసెంబ్లీ ప్రాంగణంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో పెనాల్టీలు, టెండర్ ధరలు, స్టాక్ వ్యత్యాసాలు, పెండింగ్ సరఫరాలపై సమగ్రంగా చర్చించారు. మిల్లర్లను ప్రభుత్వం ప్రత్యర్థులుగా కాకుండా భాగస్వాములుగా చూస్తుందని ఉత్తమ్ చెప్పారు. రైతుల ప్రయోజనాలు, ప్రజాధనం పరిరక్షణ, మిల్లింగ్ రంగం స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకుని పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. మిల్లర్లు సమర్పించిన వినతులను సానుకూలంగా పరిశీలించి, సాధ్యమైన పరిష్కారాలు చూపుతామని తెలిపారు. పెండింగ్ సరఫరాలపై అధికారులు ప్రత్యేకంగా కసరత్తు చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. నాలుగైదు రోజుల్లో మిల్లర్లతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. ఏకపక్ష నిర్ణయాలకు తావులేకుండా చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొంటూ, మిల్లర్లు సమ్మె విరమించి ప్రభుత్వ చర్చలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.





# కిమ్ దెబ్బతో కొరియాలో కృత్రిమ భూకంపం

**అణు పరీక్షలతో కొండల్లో ప్రకంపనలు**

**శాస్త్రవేత్తల పరిశీలనలో 1,399 నిర్ధారణ**

ఉత్తర కొరియా అణు పరీక్షలు నిర్వహించిన మౌంట్ మాంటాప్ ప్రాంతంలో భూకంప కార్యకలాపాలు పెరిగినట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. 2008 నుంచి 2025 వరకు నమోదైన భూకంప డేటాను పరిశీలించిన శాస్త్రవేత్తలు 1,399 ప్రకంపనలను గుర్తించారు. 2006 నుంచి 2017 మధ్య ఉత్తర కొరియా అక్కడ ఆరు భూగర్భ అణు పరీక్షలు నిర్వహించింది. ఈ ప్రాంతంలో అంతకుముందు దాదాపు 2,000 ఏళ్లుగా భూకంప కార్యకలాపాలు చాలా తక్కువగా ఉన్నట్లు పరిశోధకులు తెలిపారు. 2013లో మూడో అణు పరీక్ష తర్వాత తొలి భూకంపం నమోదైంది. అయితే 2017లో జరిగిన ఆరో, అతిపెద్ద అణు పరీక్ష తర్వాత ప్రకంపనలు ఒక్కసారిగా పెరిగినట్లు అధ్యయనం పేర్కొంది.

**పర్వతంలో పగుళ్లు.. పెరిగిన ప్రకంపనలు**

2017 అణు పరీక్ష సమయంలో 6.3 తీవ్రతతో భూకంపం నమోదైంది. ఆ పేలుడు కారణంగా సొరంగం కూలిపోవడంతో పాటు పర్వత శిఖరం ఆకృతి సుమారు మూడు మీటర్లు మారినట్లు పరిశోధనలో పేర్కొన్నారు. ఆ తర్వాత నమోదైన భూకంపాలు ఎక్కువగా 2 నుంచి 3 తీవ్రత మధ్యే ఉన్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు. అణు పేలుడు ప్రభావంతో పర్వతంలోని పాత నిద్రాణ పగుళ్లు మళ్లీ చురుకుగా మారి ఉండవచ్చని అంచనా వేశారు.

**నీటి ఒత్తిడితో రాళ్ల కదలిక**

పేలుడు వల్ల ఏర్పడిన కొత్త పగుళ్లలోకి నీరు చేరడం కూడా ప్రకంపనలకు కారణమై ఉండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. పగుళ్లలో నీటి ఒత్తిడి పెరగడంతో రాళ్లు ఒకదానిపై మరొకటి జారుతూ చిన్న భూకంపాలకు దారితీస్తున్నట్లు అధ్యయనం సూచించింది. సాధారణంగా అణు పేలుళ్లతో సంబంధం ఉన్న భూకంప కార్యకలాపాలు పరీక్ష ముగిసిన తర్వాత కొంతకాలానికే తగ్గిపోతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కానీ మాంటాప్ ప్రాంతంలో మాత్రం 2017 తర్వాత కూడా ప్రకంపనలు కొనసాగడం ప్రత్యేకంగా గమనించాల్సిన అంశంగా మారింది.



# పాకిస్థాన్ మసీదులో మారణహోమం

- **పేలుడులో 21 మంది మృతి**
- **పోలీసు కార్యాలయాల సమీపంలో దాడి**

పాకిస్థాన్‌లో మరోసారి ఉగ్రదాడి కలకలం రేపింది. ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లోని కోహాట్ జిల్లాలో శుక్రవారం మసీదులో జరిగిన ఆత్మాహుతి పేలుడులో కనీసం 21 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 78 మంది గాయపడ్డారు. మృతుల్లో 15 మంది పోలీసు అధికారులు ఉన్నారు. పోలీసు కార్యాలయాలు ఉన్న భవనం సమీపంలోని మసీదును లక్ష్యంగా చేసుకుని దాడి జరిగినట్లు అధికారులు తెలిపారు.

**పేలుడు వాహనంతో మసీదుపై దాడి**

ప్రావిన్షియల్ పోలీస్ చీఫ్ జుల్ఫికర్ హమీద్ వివరాల ప్రకారం, పేలుడు పదార్థాలతో నింపిన వాహనాన్ని దుండగుడు మసీదులోకి దూసుకెళ్లించాడు. భారీ పేలుడుతో పోలీసు కార్యాలయాల బయటి గోడ కూలిపోయింది. మసీదు తీవ్రంగా దెబ్బతింది. గాయపడిన వారిలో ఎక్కువ మంది ప్రార్థనలకు వచ్చిన భక్తులేనని సహాయక బృందాలు తెలిపాయి. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడించాయి.

**దుండగుల కాల్పులు.. ఒకరి హతం**

దాడి సమయంలో ఇద్దరు సాయుధ వ్యక్తులు పోలీసు ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. వారిని అడ్డుకునే క్రమంలో భద్రతా సిబ్బందికి, దుండగులకు మధ్య కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఒక దుండగుడు హతమైనట్లు బీబీసీ నివేదించింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ దాడిని తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేశ అధ్యక్షుడు ఆకాంక్షించారు.

**వరుస దాడులతో పెరుగుతున్న ఆందోళన**

కోహాట్ దాడికి ఒక రోజు ముందు హంగూ జిల్లాలో భద్రతా బలగాల కాన్వాయ్‌పై రోడ్డుపక్క బాంబు దాడి జరిగింది. అందులో ఆరుగురు సైనికులు మరణించారు. గురువారం వివిధ ప్రాంతాల్లో సైన్యం, పోలీసులు నిర్వహించిన దాడుల్లో పాకిస్థాన్ తాలిబాన్‌కు చెందినట్లు అనుమానిస్తున్న 10 మంది మిలిటెంట్లు హతమైనట్లు అధికారులు తెలిపారు. పోలీసు, పౌరులపై పాకిస్థాన్ తాలిబాన్ దాడులు ఇటీవలి సంవత్సరాల్లో పెంచింది. 2023లో పెషావర్ మసీదుపై ఆత్మాహుతి దాడిలో 101 మంది మరణించారు. ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబాన్‌తో టీపీపీకి సంబంధాలున్నప్పటికీ రెండు సంస్థలు వేర్వేరు. టీపీపీకి కాబూల్ ఆశ్రయం ఇస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తుండగా, ఆఫ్ఘన్ ప్రభుత్వం ఆ ఆరోపణలను ఖండిస్తోంది.



# పాత బస్టాండ్ చోరీలో ముగ్గురు అరెస్ట్

ప్రొద్దుటూరు పాత బస్టాండ్‌లో రద్దీని ఆసరాగా చేసుకుని మహిళ హ్యాండ్‌బ్యాగ్ నుంచి బంగారు గాజులు చోరీ చేసిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, రూ.3.90 లక్షల విలువైన నాలుగు బంగారు గాజులు స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్పీ విభూకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 12న చిలమకూరు గ్రామానికి చెందిన సారెడ్డి లక్ష్మీదేవి బస్సు ఎక్కే సమయంలో ఆమె బ్యాగులోని పర్సు నుంచి సుమారు ఐదు తులాల బరువున్న గాజులు అపహరణకు గురయ్యాయి. మరుసటి రోజు అందిన ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, విశ్వసనీయ సమాచారంతో నిందితులను గుర్తించారు. శుక్రవారం వాసవి సర్కిల్ వద్ద షేక్ కరమల్ల షబీనా అలియాస్ పఠాన్ షబీనా, పఠాన్ ముబీనా, పఠాన్ షాహిద్‌ఖాన్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరు అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం గోపన్నపల్లికి చెందినవారిగా పోలీసులు తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో మహిళలు, వృద్ధులు బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్లు, హ్యాండ్‌బ్యాగులపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీఐ రామాంజనేయుడు, ఎస్సై సంజీవరెడ్డి, ఏఎస్ఐ సుబ్బన్న పాల్గొన్నారు.

# అక్రమ లేఅవుట్లపై ఆమంచి ఆగ్రహం

- **26 ఎకరాల భూములపై ఆరోపణలు**

చీరాల తీర ప్రాంతంలో ప్రభుత్వ భూములు అక్రమంగా చేతులు మారుతున్నాయని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఆరోపించారు. క్రిస్టల్ మార్ట్ సముదాయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పర్యాటక అభివృద్ధితో భూముల ధరలు పెరగడంతో రామాపురంలోని సుమారు 26 ఎకరాల ప్రభుత్వ భూముల రికార్డులు తారుమారయ్యాయని ఆరోపించారు. అక్రమార్కులకు కొందరు అధికారులు సహకరిస్తున్నారని, దీనికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. త్వరలో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. సీఆర్‌జడ్, నో డెవలప్‌మెంట్ జోన్ నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కటారివారిపాలెంలో తప్పుడు సర్వే నంబర్లతో నిర్మించిన రిసార్ట్‌పై కలెక్టర్ చర్యలకు ఆదేశించినా అమలు కాలేదని ప్రశ్నించారు.



**చెత్త నిర్వహణకు దూరమైన చీరాల**

లేఅవుట్లలో భవిష్యత్ అవసరాల కోసం 40 శాతం భూమి కేటాయించాల్సి ఉండగా, 10 శాతం కూడా వదలకుండా వెంచర్లు వేస్తున్నారని ఆమంచి ఆరోపించారు. గతంలో రూ.9 కోట్లతో ఏర్పాటు చేసిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ నిర్లక్ష్యంతో మరుగున పడిందన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ జాతీయ అవార్డు పొందిన చీరాల మున్సిపాలిటీ ఒకప్పుడు ఇతర కమిషనర్లకు శిక్షణ ఇచ్చేదని గుర్తుచేశారు. ప్రస్తుతం చెత్తను గుంటూరు, విజయవాడలకు తరలిస్తూ ప్రాసెసింగ్ చార్జీలు, డీజిల్, సిబ్బంది ఖర్చుల పేరుతో ప్రజాధనం వృథా అవుతోందని విమర్శించారు.

# మమత గీసిన గుర్తుకే ఇప్పుడు చిక్కులు

1998లో తృణమూల్ కాంగ్రెస్‌ను స్థాపించిన మమతా బెనర్జీ స్వయంగా గీసిన 'జోడా ఘాస్ ఫూల్' గుర్తు ఇప్పుడు ఆ పార్టీ అంతర్గత పోరుకు కేంద్రంగా మారింది. తృణమూల్ కాంగ్రెస్‌లో చీలిక నేపథ్యంలో మమతా వర్గం, తిరుగుబాటు వర్గం పార్టీ పేరు, గుర్తుపై హక్కు కోరాయి. ఈ వివాదంపై తుది నిర్ణయం తీసుకునేందుకు సమయం సరిపోలేదని పేర్కొన్న ఎన్నికల సంఘం, అక్టోబర్ 6 ఉప ఎన్నికల వరకు అసలు పార్టీ పేరు, గుర్తును తాత్కాలికంగా ఫ్రీజ్ చేసింది.

**రెండు వర్గాలకు కొత్త గుర్తులు**

తుది నిర్ణయం వచ్చే వరకు రెండు వర్గాలు వేర్వేరు పేర్లు, గుర్తులతో ఎన్నికల్లో పోటీ చేయాల్సి వచ్చింది. మమతా వర్గానికి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరుతో ఫుట్‌బాల్ ప్లేయర్ గుర్తు, అరూప్ రాయ్ వర్గానికి 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' పేరుతో ఎన్వలప్ గుర్తు కేటాయించారు. ఈ వ్యవహారం ఎన్నికల గుర్తుల కేటాయింపుపై గతంలో ఏర్పడిన వివాదాలను మళ్లీ తెరపైకి తెచ్చింది. ముఖ్యంగా 1969లో ఇందిరాగాంధీ వర్గం, కాంగ్రెస్ పాత నాయకత్వం మధ్య జరిగిన చీలికలో ఎన్నికల సంఘం అనుసరించిన విధానం ఇప్పుడు కీలకంగా మారింది.



- **తృణమూల్ సింబల్‌ను ఫ్రీజ్ చేసిన ఈసీ**

**ఇందిరా కేసులో మూడు పరీక్షలు**

1969 కాంగ్రెస్ వివాదంలో ఎన్నికల సంఘం పార్టీ లక్ష్యాలు, పార్టీ రాజ్యాంగం, సంస్థాగత బలం అనే మూడు అంశాలను పరిశీలించింది. మొదటి రెండు అంశాల్లో స్పష్టమైన ఆధారం దొరకకపోవడంతో చివరకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ సంస్థల ప్రతినిధుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంది. ఇందిరాగాంధీ వర్గానికి ఎక్కువ మంది ప్రజాప్రతినిధుల మద్దతు ఉండటంతో ఆ వర్గాన్నే అసలైన కాంగ్రెస్‌గా గుర్తించింది. తర్వాత శివసేన, ఎన్సీపీ వివాదాల్లోనూ ప్రజాప్రతినిధుల బలం కీలకంగా మారింది. ముఖ్యంగా ఎన్సీపీ కేసులో సంస్థాగత నిర్మాణంపై స్పష్టత లేకపోవడంతో లెజిస్లేటివ్ వింగ్‌లో మెజారిటీని ఆధారంగా తీసుకున్నారు.

**జూన్ 22 సమావేశమే కీలకమా?**

తృణమూల్ వివాదంలో పార్టీ సంస్థాగత నిర్మాణంపై ఉన్న ప్రశ్నలు కీలకంగా మారాయి. జూన్ 22న అరూప్ రాయ్‌ను పార్టీ జాతీయ వర్కింగ్ కమిటీ చైర్మన్‌గా ఎన్నుకున్నట్లు తిరుగుబాటు వర్గం చెబుతోంది. మమతా వర్గం మాత్రం ఆ సమావేశం చెల్లదని వాదిస్తోంది. ఇదే సమయంలో మమతా బెనర్జీ ఎన్నికల సంఘం తాత్కాలిక నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేశారు. చివరకు పార్టీ పేరు, 'జోడా ఘాస్ ఫూల్' గుర్తుపై హక్కు ఎవరికి దక్కుతుంది? అన్నది ఎన్నికల సంఘం తుది నిర్ణయంతో తేలనుంది.

# రాజకీయంగా టార్గెట్ చేశారు

- **ఈడీ నోటీసులపై అంబటి ఫైర్**

మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబుకు లిక్కర్ కేసు దర్యాప్తులో ఈడీ నోటీసులు జారీ అయ్యాయి. సెప్టెంబర్ 11న విచారణకు రావాలని పేర్కొన్న నోటీసు తనకు 18న అందిందని, గడువు ముగిసిన తర్వాత అందినందున కొత్తగా లిఖితపూర్వక నోటీసు ఇవ్వాలని కోరినట్లు అంబటి తెలిపారు. రాజకీయ కక్షతోనే తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. గత నెల 28న గుండెకు సంబంధించిన ప్రొసీజర్ జరిగి రెండు స్టంట్లు వేశారని, ప్రస్తుతం వైద్యుల సూచనల మేరకు రికవరీలో ఉన్నానని చెప్పారు. లీగల్ టీమ్, వైద్యుల సలహా తీసుకున్న తర్వాత విచారణకు హాజరయ్యే తేదీపై నిర్ణయం తీసుకుంటానని, దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తానని స్పష్టం చేశారు.

**రాజకీయ వేధింపులన్న అంబటి**

లిక్కర్ వ్యాపారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని అంబటి పేర్కొన్నారు. తన సన్నిహితుడు మర్రి సుబ్బారెడ్డిని విచారణ పేరుతో ఒత్తిడికి గురిచేసి తన పేరు చెప్పించాలని ప్రయత్నించారని అంబటి ఆరోపించారు. చంద్రబాబు, పెమ్మసాని చంద్రశేఖర్, నారా లోకేష్ రాజకీయంగా తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన విమర్శించారు. తనపై ఇప్పటికే 50 నుంచి 60 కేసులు పెట్టి, 18 రోజులు జైలులో ఉంచినా గళం తగ్గలేదని అన్నారు. ఈడీ, సీబీఐ, సీఐడీ వంటి సంస్థలతో భయపెట్టలేరని, కేసులను చట్టపరంగా ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. తనను ఎంతగా లక్ష్యంగా చేసుకుంటే అంతగా తన గొంతు పెరుగుతుందని వ్యాఖ్యానించారు. కాగా, అంబటి ఆరోపణలపై సంబంధిత ప్రభుత్వ వర్గాల స్పందన ఈ కథనంలో అందుబాటులో లేదు.



# టీడీపీకి ఓటేస్తే లోకేశ్ సీఎం

- **వైసీపీకి ఓటేస్తే జగన్ సీఎం**
- **నాకు ఓటేస్తే మీలో ఒకరు సీఎం!**

**అనంతపురం:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త రాజకీయ ప్రత్యామ్నాయాన్ని తెరపైకి తీసుకొస్తున్న మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అనంతపురం ప్రెస్‌మీట్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని టీడీపీ, వైసీపీలకు ప్రత్యామ్నాయంగా తమ పార్టీని ప్రజల ముందుకు తీసుకొస్తామని ప్రకటించారు. ''టీడీపీకి ఓటు వేస్తే నారా లోకేశ్ ముఖ్యమంత్రి అవుతారు.. వైసీపీకి ఓటు వేస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారు.. అదే మా పార్టీకి ఓటు వేస్తే మీలో ఒకరు ముఖ్యమంత్రి అవుతారు'' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

**యువత కోసమే రాజకీయ పార్టీ**

తాను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉండబోనని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. సమాజానికి సేవ చేయాలనే తపన, సామర్థ్యం, అనుభవం ఉన్న యువతలో ఒకరిని ముఖ్యమంత్రిగా చేసే లక్ష్యంతో కొత్త రాజకీయ వేదికను నిర్మిస్తున్నట్లు తెలిపారు. తాను మాత్రం పార్టీకి మార్గనిర్దేశం చేసే పాత్రలో ఉంటానని చెప్పారు. కొత్త పార్టీ రాష్ట్ర రాజకీయాల్లో మూడో ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాయలసీమ అభివృద్ధి అంశాన్ని కూడా విజయసాయిరెడ్డి ప్రధానంగా ప్రస్తావించారు. ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు నీటి వనరుల వినియోగం, యువతకు ఉపాధి అవకాశాలు, ప్రాంతీయ అభివృద్ధిపై దృష్టి పెడతామని తెలిపారు. రాయలసీమకు శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు.



**ఒరిజినల్ రెడ్ల ఆత్మగౌరవం కోసం పనిచేస్తా**

అదే సమయంలో రాయలసీమలో రాజకీయ ఆధిపత్యంపై కూడా ఆయన విమర్శలు చేశారు. రెండు ప్రధాన రాజకీయ కుటుంబాల పాలనతో ప్రాంతానికి ఆశించిన స్థాయిలో ప్రయోజనం కలగలేదని ఆయన వ్యాఖ్యానించారు. తన పార్టీ అన్ని కులాలు, మతాలను గౌరవిస్తుందని చెబుతూనే, రాయలసీమలోని ''ఒరిజినల్ రెడ్ల'' ఆత్మగౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం కూడా పనిచేస్తామని ప్రకటించారు. విజయదశమి అనంతరం కొత్త పార్టీని అధికారికంగా ప్రకటించి, పార్టీ జెండా, పేరు, విధివిధానాలను వెల్లడించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. దీంతో విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ ప్రయాణం రాయలసీమలో ఎలాంటి రాజకీయ సమీకరణాలకు దారితీస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



## అగార్కర్ నిష్క్రమణకు దారి

**రికార్డులు వచ్చాయి.. కానీ ఎంపికలపై ప్రశ్నలే!**

టీమిండియా చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం ముగింపు దశకు చేరుకోవడంతో ఆయన నిర్ణయాలపై మరోసారి చర్చ మొదలైంది. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఎంపికలో మహ్మద్ సిరాజ్‌కు చోటు ఇవ్వకపోవడం, యశస్వి జైస్వాల్‌ను తప్పించి వరుణ్ చక్రవర్తిని ఎంపిక చేయడం వంటి నిర్ణయాలపై అప్పట్లోనే తీవ్ర చర్చ జరిగింది. శుభ్‌మన్ గిల్ విషయంలోనూ 2026 టీ20 ప్రపంచకప్ సన్నాహాల్లో చివరి దశ వరకు కొనసాగించి, తర్వాత జట్టులోకి తీసుకోకపోవడంపై మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ సెలక్షన్ కమిటీపై విమర్శలు గుప్పించాడు. ఇక విదేశీ పర్యటనల్లో భారత జట్టు ఎదుర్కొన్న పరాజయాలు కూడా సెలక్షన్ వ్యవస్థపై ప్రశ్నలు రేకెత్తించాయి. 2026లో ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్యటనల తర్వాత బీసీసీఐ ప్రత్యేక సమీక్ష నిర్వహించింది. ఆ కీలక సమావేశానికి అగార్కర్ హాజరుకాకపోవడం కూడా ఆయన భవిష్యత్తుపై ఊహాగానాలకు కారణమైంది. అయితే బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాత్రం ఆయన ముందస్తు ప్రయాణం కారణంగానే సమావేశానికి రాలేకపోయారని వివరణ ఇచ్చారు. అయితే ఇదే అగార్కర్ హయాంలో భారత్ 2024 టీ20 ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ సాధించింది. కాబట్టి వైఫల్యాలు మాత్రమే కాదు.. విజయాలు, వివాదాస్పద ఎంపికలు, కీలక నిర్ణయాలన్నింటినీ కలిపి అగార్కర్ వారసత్వాన్ని అంచనా వేయాల్సిన పరిస్థితి ఇప్పుడు బీసీసీఐ ముందుంది. ఆయన కొనసాగుతారా? కొత్త ముఖానికి అవకాశం వస్తుందా? నిర్ణయం కోసం క్రికెట్ ప్రపంచం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది.



# వరదరాజుల రెడ్డి ఆదేశాలతో అధికారుల్లో కదలిక

ప్రొద్దుటూరు మండలంలో తాగునీరు, పశువుల నీరు, విద్యుత్ సరఫరా, రహదారులు, కాలువల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హౌసింగ్ బోర్డు కాలనీలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అన్ని గ్రామాల్లో ప్రజలకు తగినంత తాగునీరు అందేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పశువులకు నీటి కొరత రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సబ్సిడీపై అందించే మినుములను రైతులకు పంపిణీ చేశారు. గ్రామాల్లో చేపట్టిన రహదారులు, కాలువల పనులను వేగంగా పూర్తి చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో MPDO సూర్యనారాయణరెడ్డి, MRO ఉదయభాస్కర్‌రాజు, మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి చైర్మన్ పట్నం లక్ష్మణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# టౌన్ బ్యాంకు ఆరోపణలపై రాచమల్లు సవాల్

ప్రొద్దుటూరు టౌన్ బ్యాంకు వ్యవహారంపై తనపై వస్తున్న ఆరోపణలను మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఖండించారు. గత ఐదేళ్లుగా తనపై ఆరోపణలు చేస్తున్నారని, వాటిలో నిజం ఉంటే అధికార పార్టీ సమగ్ర విచారణ జరిపి నిరూపించాలని సవాల్ చేశారు. దొరసానిపల్లెలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీడీపీ నేత ఈవీ సుధాకర్‌రెడ్డి ఆరోపణలపై స్పందించిన రాచమల్లు, తాను ఎవరినీ మోసం చేయలేదని, చట్టపరమైన విచారణకు పూర్తిగా సిద్ధమని తెలిపారు. టౌన్ బ్యాంకులో సుచరితకు చెందాల్సిన నగదును మరో వ్యక్తి ద్వారా ఉపసంహరించారన్న అంశంపై ఖాతా ఎలా ప్రారంభమైంది, నగదు తీసుకునే సమయంలో ఎవరు ఉన్నారు, సీసీ కెమెరా దృశ్యాలు, లెడ్జర్ వివరాలు, బ్యాంకు అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరగాలని కోరారు. తప్పు చేసిన వారు ఎవరైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. తాను పలువురితో బ్యాంకులో డిపాజిట్లు చేయించానని, ఖాతాదారుల ప్రయోజనాల కోసం ప్రశ్నించే హక్కు తనకు ఉందన్నారు. సుందరయ్య కాలనీ, చౌటపల్లి భూముల వ్యవహారాలతో తనకు సంబంధం లేదని స్పష్టం చేస్తూ, ఎన్నికల హామీలు, ప్రజా సమస్యలపైనే తాను ప్రశ్నిస్తున్నానని తెలిపారు.




## గజేంద్ర మోక్ష అలంకారంలో శ్రీమలయప్ప

సర్వభూపాల వాహనంపై గజేంద్ర మోక్ష అలంకారంలో శ్రీమలయప్ప అభయం, భక్తులను అలరించిన వైభవోపేత వాహనసేవ

# రేషన్ కార్డు, ఆధార్‌తో నివాస రుజువు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నివాస ధ్రువీకరణ పత్రాల జారీపై కీలక మార్పులు చేస్తూ కొత్త ఉత్తర్వులు జారీ చేసింది. రేషన్ కార్డు, ఆధార్‌ను నివాస రుజువుగా వినియోగించుకోవచ్చని స్పష్టం చేసింది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రవేశాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగ నియామకాలకు వీటిని రెసిడెన్స్ ప్రూఫ్‌గా సమర్పించవచ్చని పేర్కొంది. నిర్దిష్ట నియామకాలు, సైనిక దళాల రిక్రూట్‌మెంట్ వంటి అవసరాలకే ప్రత్యేక నివాస ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటికే అలాంటి సర్టిఫికెట్ జారీ చేసి ఉంటే మళ్లీ కొత్తది ఇవ్వాల్సిన అవసరం లేదని తెలిపింది. పీవీ టీజీ కుటుంబాల ఆధార్ నమోదు, అప్‌డేట్ కోసం తహసీల్దార్లు నివాస ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలన్న గత ఉత్తర్వులను తాజాగా సవరించింది. నివాస ధ్రువీకరణ పత్రాల జారీ అధికారాన్ని మళ్లీ తహసీల్దార్లకు అప్పగించింది. దరఖాస్తుదారులు ఆధారాలతో తహసీల్దారును సంప్రదించాలి. ఆధారాలు లేని సందర్భంలో స్థానికంగా విచారణ నిర్వహించి నివాసాన్ని ధ్రువీకరించిన అనంతరం సర్టిఫికెట్ జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. తాజా మార్పులతో నివాస రుజువుల విషయంలో ప్రజలకు మరింత స్పష్టత ఏర్పడనుంది.

# కేంద్రం సాయం కోరిన రాష్ట్రం

### ఎల్‌నినో ఎఫెక్ట్..
### కేంద్ర మంత్రితో సీఎం భేటీ



ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. దక్షిణ రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన కేంద్ర మంత్రిని సీఎం కలిశారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ రంగంపై వాటి ప్రభావాన్ని వివరించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ సంజయ్ జాజు సహా ఉన్నతాధికారులతో కలిసి కేంద్ర సహాయం కోరుతూ వివరాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

**ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం**

వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని సీఎం కేంద్ర మంత్రికి వివరించారు. తాగునీరు, విద్యుత్ కొరత రాకుండా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లిస్తున్నామని చెప్పారు. పంటల మార్పిడికి రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర సహకారం అవసరమని కోరారు. ఇందులో భాగంగా 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్లు, కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద తెలంగాణకు తొలి విడతగా 2 లక్షల ఇళ్లు కేటాయించినందుకు రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# ఎరువుల డీలర్లకు డీఏఈఎస్ఐ శిక్షణ



మహబూబాబాద్, సెప్టెంబర్ 19 (రాజ్య సంస్కరణ ప్రతినిధి): డీఏఈఎస్ఐ (డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్) శిక్షణ తరగతిని మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌చంద్ర శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఏఈఎస్ఐ కార్యక్రమం ఉద్దేశాలను వివరించారు. ఎరువుల డీలర్లు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఏఓ తిరుపతిరెడ్డి, డీఈఎస్ఐ కార్యక్రమం ప్రెసిడెంట్ రాంచందర్‌రావు, కేవీకే మల్యాల డాక్టర్ సుహాసిని పాల్గొన్నారు. డీఏఈఎస్ఐ శిక్షణ పొందుతున్న ఎరువుల డీలర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆళ్ల తనయుడి నిశ్చితార్థ వేడుక

### ఇషాన్ నిశ్చితార్థానికి జగన్ దంపతులు హాజరు



బెంగళూరులో ఆళ్ల ఇషాన్ నిశ్చితార్థం వైభవంగా జరిగింది. మాజీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి కుమారుడు ఇషాన్, నీనా వివాహ నిశ్చితార్థ వేడుకకు మాజీ ముఖ్యమంత్రి, వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్, భారతి దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు నీనా-ఇషాన్‌లను జగన్ దంపతులు ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు, ఆత్మీయుల సమక్షంలో జరిగిన ఈ వేడుక సందడిగా సాగింది. వైయస్ఆర్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి దంపతులు కూడా నిశ్చితార్థ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

**జగన్ యూరప్ పర్యటనకు కోర్టు గ్రీన్‌సిగ్నల్**

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ యూరప్ పర్యటనకు నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. అక్టోబర్ 1 నుంచి నవంబర్ 30 మధ్య 15 రోజుల యూరప్ పర్యటన చేపట్టేందుకు న్యాయస్థానం అనుమతించింది. ఆస్తుల కేసుల్లో బెయిల్‌పై ఉన్న జగన్ విదేశాలకు వెళ్లేందుకు సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. న్యాయ స్థానం పర్యటనకు అనుమతిస్తూ కొన్ని నిబంధనలు విధించింది.

# అన్నా.. నీ అనురాగం



### మేనకోడలు పెళ్లికి జగన్ దంపతులు
### అంతకుముందు జగన్ ఇంటికి చెల్లెమ్మ

రాజకీయాలు బంధాలను విడదీస్తాయా? లేక రక్తసంబంధం చివరికి రాజకీయ గీతలన్నింటినీ చెరిపేస్తుందా? వైఎస్ కుటుంబాన్ని చాలాకాలంగా వెంటాడుతున్న అన్నాచెల్లెళ్ల విభేదాల మధ్య ఇప్పుడు ఓ పెళ్లి శుభలేఖ కొత్త కథకు తెరతీస్తున్నట్టుగా కనిపిస్తోంది. రాజకీయంగా పరస్పరం తీవ్ర విమర్శలు చేసుకున్న వైఎస్ జగన్, వైఎస్ షర్మిల.. ఇప్పుడు ఒకే కుటుంబ శుభకార్యం కారణంగా మరోసారి ఒకరినొకరు పలకరించుకునే సందర్భం రావడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. షర్మిల కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహానికి ముహూర్తం ఖరారైంది. సెప్టెంబర్ 24న నిశ్చితార్థం, నవంబర్ 25న వివాహం, డిసెంబర్ 5న హైదరాబాద్‌లో రిసెప్షన్ నిర్వహించనున్నట్లు షర్మిల ప్రకటించారు. అంతకుముందు ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద తొలి శుభలేఖను ఉంచి తండ్రి వైఎస్సార్ ఆశీస్సులు తీసుకున్నారు.

**జగన్ ఇంటి గడప తొక్కనున్న షర్మిల?**

ఈ శుభకార్యానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను అన్న జగన్ ఇంటి గడపకు తీసుకెళ్లాలని షర్మిల నిర్ణయించినట్లు తాజాగా కథనాలు వెలువడ్డాయి. తల్లి విజయమ్మతో కలిసి బెంగళూరులోని జగన్ నివాసానికి వెళ్లి కుమార్తె పెళ్లికి స్వయంగా ఆహ్వానించనున్నట్లు సమాచారం. ఒకప్పుడు ఒకే ఇంట్లో అన్నాచెల్లెళ్లుగా, ఒకే కుటుంబ ఆశయాలతో నడిచిన ఇద్దరి మధ్య కాలక్రమంలో రాజకీయ విభేదాలు ఎంత దూరం పెంచాయో తెలుగు రాష్ట్రాల ప్రజలకు తెలిసిందే. కానీ పెళ్లి పిలుపు మాత్రం రాజకీయ ప్రసంగం కాదు.. అది ఒక తల్లి తన కుమార్తె పెళ్లికి అన్నను పిలిచే ఆహ్వానం. అందుకే ఈ గడప తొక్కే క్షణానికి రాజకీయ అర్థాల కంటే కుటుంబ భావోద్వేగమే ఎక్కువగా కనిపిస్తోంది. చేతిలో శుభలేఖ.. పక్కన తల్లి విజయమ్మ.. ఎదురుగా అన్న జగన్.. ఈ దృశ్యం వైఎస్ కుటుంబాన్ని అభిమానించే వారికి సహజంగానే పాత జ్ఞాపకాలను గుర్తుచేస్తోంది.

**అన్నాచెల్లెళ్లను కలపనున్న పెళ్లి వేడుక**

వైఎస్ కుటుంబంలో పెళ్లిళ్లు కేవలం కుటుంబ వేడుకలు మాత్రమే కావు. ఆ కుటుంబంతో అనుబంధం ఉన్న కోట్లాది అభిమానులకు అవి భావోద్వేగ సందర్భాలు. గతంలో షర్మిల కుమారుడు రాజారెడ్డి వివాహ వేడుకలకు జగన్ దంపతులు హాజరైన విషయం కూడా ఈ నేపథ్యంలో గుర్తుకు వస్తోంది. ఇప్పుడు మేనకోడలు అంజలి రెడ్డి వివాహానికి జగన్ దంపతులు వస్తారా? నిశ్చితార్థానికి హాజరవుతారా? వివాహ వేడుకలో అన్నాచెల్లెళ్లు ఒకే వేదికపై కనిపిస్తారా? అన్న ఆసక్తి సహజంగానే మొదలైంది. అయితే జగన్ దంపతుల హాజరుపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదని గుర్తుంచుకోవాలి. కాబట్టి దీనిని ఖరారైన నిర్ణయంగా కాకుండా, కుటుంబ ఆహ్వానం నేపథ్యంలో ఏర్పడిన ఆసక్తిగా చూడాల్సి ఉంటుంది.

**రాజకీయ విభేదాలపై కుటుంబ బంధం గెలుస్తుందా?**

ఒకప్పుడు వైఎస్సార్ కుటుంబంలో అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రత్యేకమైన స్థానం ఉండేది. తండ్రి వైఎస్సార్ రాజకీయ ప్రయాణంలో కుటుంబం మొత్తం ఒకే భావోద్వేగ బంధంతో కనిపించేది. ఆయన మరణం తర్వాత రాజకీయ పరిస్థితులు మారాయి. ఆ తర్వాత అన్నాచెల్లెళ్ల మధ్య అభిప్రాయ భేదాలు బహిరంగ రాజకీయ పోరాటాలుగా మారాయి. ఒకరి రాజకీయ ప్రయాణం మరోకరికి ప్రత్యామ్నాయంగా కనిపించే పరిస్థితి ఏర్పడింది. కానీ కాలం ఎంత దూరం తీసుకెళ్లినా.. కుటుంబ బంధం అనే పదానికి తనదైన అర్థం ఉంటుంది. అంజలి పెళ్లి ఆ బంధాన్ని మరోసారి గుర్తు చేస్తున్న సందర్భం. పెళ్లి పిలుపు తీసుకుని వెళ్లే చెల్లెలి మనసులో రాజకీయ లెక్కలు ఉంటాయా? లేక తండ్రి లేని ఇంట్లో అన్న ఆశీర్వాదం కూడా ఉండాలనే సహజమైన తపన ఉంటుందా? ఈ ప్రశ్నలకు సమాధానం వారి మనసులకే తెలుసు. బయటికి మాత్రం కనిపించేది ఒక్కటే.. శుభలేఖతో అన్న ఇంటి గడప తొక్కుతున్న చెల్లెలి అడుగు.



**రాజకీయాలకు అతీతంగా బంధాల పిలుపు**

అందుకే ఇప్పుడు ఈ కథకు రాజకీయ రంగు పూయడం కంటే.. ఒక కుటుంబం కథగా చూడటం మరింత సహజం. రాజకీయ వేదికలపై ఎవరి దారులు వారివి కావచ్చు. సిద్ధాంతాలు, పార్టీలు, విమర్శలు, పోరాటాలు తమ స్థానంలో ఉండొచ్చు. కానీ పెళ్లి పందిరి దగ్గర మాత్రం బంధుత్వానికి మరో భాష ఉంటుంది. అంజలి రెడ్డి పెళ్లి సందర్భంగా జగన్ దంపతులు మేనకోడలిని ఆశీర్వదించడానికి వస్తే.. అది ఒక కుటుంబ శుభకార్యానికి హాజరైన సందర్భమే అవుతుంది. షర్మిల విజయమ్మతో కలిసి జగన్ ఇంటికి వెళ్లి శుభలేఖ అందిస్తే.. అది కూడా ఒక చెల్లెలి కుటుంబ ఆహ్వానమే. అయితే ఆ రెండు క్షణాల మధ్య ఒక పెద్ద భావోద్వేగం దాగి ఉంది. రాజకీయంగా ఎంత దూరమైనా.. రక్తసంబంధం మాత్రం తన దారి తాను వెతుక్కుంటుందనే భావన. చివరికి పెళ్లి పిలుపు చెప్పేది రాజకీయ సందేశం కాదు.. "అన్నా.. మా ఇంటి శుభకార్యానికి నువ్వు రావాలి" అనే ఆత్మీయ పిలుపు. అదే ఈ కథలోని అసలు సెంటిమెంట్.

# జడ్పీ పీఠంపై సునీత స్కెచ్?

### వైఎస్ కుటుంబానికి కొత్త టర్న్..!
### టీడీపీ నేతలతో వరుస మంతనాలు
### తెరపైకి బంధువు ప్రదీప్‌రెడ్డి పేరు



కడప రాజకీయాల్లో మరో ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంటుందా..? ఇంతకాలం ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్న వైఎస్ సునీత కుటుంబం స్థానిక రాజకీయాల్లో కీలక పాత్ర పోషించేందుకు అడుగులు వేస్తుందా..? ఇప్పుడు జిల్లాలో జరుగుతున్న చర్చ ఇదే. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కడప జడ్పీ చైర్మన్ పీఠం చుట్టూ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ క్రమంలో వైఎస్ సునీతకు సమీప బంధువైన ప్రదీప్‌రెడ్డి పేరు జడ్పీ చైర్మన్ రేసులో వినిపించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. తాజాగా వైఎస్ సునీత తన భర్త రాజశేఖర్‌రెడ్డితో కలిసి కూటమికి చెందిన కీలక నేతలను కలిసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ భేటీల్లో కడప జిల్లా రాజకీయ పరిస్థితులతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా కడప జడ్పీ చైర్మన్ పదవికి ప్రదీప్‌రెడ్డిని పరిశీలించాలని సునీత వర్గం ప్రతిపాదించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే దీనిపై టీడీపీ లేదా కూటమి నుంచి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి తుది ప్రకటన వెలువడ లేదు.

**సునీత కుటుంబం రాజకీయ అరంగేట్రం**

కడప అంటేనే వైఎస్ కుటుంబ రాజకీయాలకు కీలక కేంద్రం. దశాబ్దాలుగా ఈ జిల్లాలో ఆ కుటుంబ ప్రభావం రాజకీయాలపై కనిపిస్తూ వచ్చింది. అలాంటి జిల్లాలో వైఎస్ సునీత కుటుంబానికి చెందిన వ్యక్తి కూటమి తరపున స్థానిక సంస్థల ఎన్నికల బరిలోకి దిగుతారన్న ప్రచారం సహజంగానే ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా జడ్పీ చైర్మన్ వంటి కీలక పదవికి ఆయన పేరు వినిపించడం మరింత ఆసక్తిని పెంచుతోంది. ఇక్కడ మరో రాజకీయ కోణం కూడా చర్చకు వస్తోంది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు తర్వాత సునీత రాజకీయంగా చేసిన పోరాటం అందరికీ తెలిసిందే. అయితే ఇప్పుడు ఆమె కుటుంబానికి చెందిన వ్యక్తి కూటమి రాజకీయాల ద్వారా కడప జిల్లా లో ప్రత్యక్ష రాజకీయ పాత్రలోకి వస్తే, అది స్థానిక రాజకీయ సమీకరణాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న చర్చ మొదలైంది. అయితే భవిష్యత్ రాజకీయ పరిణామాలను ఇప్పుడే నిర్ధారించడం సాధ్యం కాదు.

## కూటమిలో ప్రదీప్‌రెడ్డికి పదవి దక్కేనా?

మరోవైపు జడ్పీ చైర్మన్ పదవి కోసం కూటమిలోనే పలువురు ఆశావహులు ఉన్నట్లు తెలుస్తోంది. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య స్థానిక సంస్థల సీట్ల పంపకం, సామాజిక సమీకరణాలు, స్థానికం గా అభ్యర్థుల బలాబలాలు వంటి అంశాలు తుది నిర్ణయంలో కీలకంగా మార నున్నాయి. దీంతో ప్రదీప్‌రెడ్డి పేరుపై జరుగుతున్న చర్చలు చివరకు అభ్యర్థి త్వానికి దారితీస్తాయా లేదా అన్నది ఆసక్తి కరంగా మారింది. కడప రాజకీయాల్లో వైఎస్ కుటుంబానికి చెందిన వ్యక్తి కూటమి రాజకీయాల వైపు అడుగులు వేస్తే మాత్రం అది కేవలం ఒక జడ్పీ స్థానం వ్యవహారంగా మిగిలిపోతుందా, లేక జిల్లాలో కొత్త రాజకీయ సమీకరణానికి సంకేతంగా మారుతుందా అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న. జడ్పీ ఎన్నికల ప్రక్రియ మొదలయ్యే నాటికి ఈ ప్రచారానికి ఎంతవరకు రాజకీయ రూపం వస్తుందో వేచి చూడాల్సిందే.



### 3 ఉచిత సిలిండర్లపై
# శుభవార్త

ఆంధ్రప్రదేశ్‌లో ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలులో మరో మార్పు తీసుకురావడానికి ప్రభు త్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉచిత సిలిండర్ తీసుకు న్న తర్వాత లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రాయితీ మొత్తం ఎప్పుడు జమ అవుతుందనే దానిపై స్పష్టత లేకపోవడంతో వినియో గదారులు ఎదురు చూడాల్సి వస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కొత్త విధానాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇకపై లబ్ధిదారుడు సిలిండర్ తీసుకున్న తర్వాతి నెలలోనే నిర్ణీత తేదీన రాయితీ నగదును ఖాతాలో జమ చేసేలా విధానం రూపొందించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమా చారం. దీనికి సంబం ధించిన విధివిధానాలపై ఉన్న తాధికారులు ప్రస్తుతం కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. రాయితీ చెల్లింపులకు ఒకే తేదీని నిర్ణయిస్తే లబ్ధిదారులకు ముందు గానే నగదు జమయ్యే సమయం తెలుస్తుందని అధికా రులు భావిస్తు న్నట్లు సమాచారం. పథకం అమలులో నగదు జమపై నెలకొన్న సందిగ్ధతకు దీంతో తెరపడే అవ కాశం ఉంది. ప్రతిపాదిత విధానంపై తుది నిర్ణయం తీసుకున్న తర్వాత ప్రభుత్వం అధికారికంగా ప్రకటన చేసే అవకాశం ఉంద ని సమాచారం. అయితే, కొత్త విధానం ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుంది, నిర్ణీత తేదీ ఏది అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

